ఉద్యోగులకు ఎస్బీఐ వార్నింగ్!

- కస్టమర్ల అనుమతి లేకుండా బీమా ప్రీమియంలు కట్
- రుజువైతే కఠిన చర్యలే

ముంబై, జనవరి 25: కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా పథకాల్లో అనుమతి లేకుండా కస్టమర్లను చేర్చుకోవడంపై తమ ఉద్యోగులను ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) హెచ్చరించింది. విజిల్-బ్లోయర్ పాలసీ కింద బ్యాంక్‌కు ఫిర్యాదులు అందడంతో ఈ మేరకు ఓ సంస్థాగత లేఖను ఎస్బీఐ విడుదల చేసినట్టు తెలుస్తున్నది. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి పాలసీల కోసం కస్టమర్లకు చెప్పకుండానే, వారి నుంచి ఎటువంటి అంగీకారం లేకుండానే ఖాతాల నుంచి ప్రీమియంలను కట్ చేస్తున్నారని బ్యాంక్‌కు తెలియవచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన బ్యాంక్.. ఇటువంటి చర్యలకు బాధ్యులైనవారిపై కఠినంగా ప్రవర్తిస్తామని హెచ్చరించింది. ఇందుకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు పై అధికారులకు అందితే వెంటనే స్పందించాలని కూడా సూచించింది. కాగా, ప్రాంతీయ వ్యాపార కార్యాలయాల్లో (ఆర్బీవో) ఉన్న అధికారులే ఇలా చేస్తున్నారని అంటున్నారు.

బ్యాంక్‌ల్లో నగదు కటకట

రూ.3.5 లక్షల కోట్ల లిక్విడిటీ లోటుతో సతమతం

జీఎస్టీ, అడ్వాన్స్ టాక్స్ చెల్లింపులతో తరుగుదల • రంగంలోకి దిగిన ఆర్బీఐ

వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్లు ప్రవేశపెట్టనున్న కేంద్ర బ్యాంక్

ముంబై, జనవరి 25: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ రుణ వితరణకు తగిన నగదు నిల్వలు లేక అల్లాడుతున్నది. జీఎస్టీ, అడ్వాన్సు టాక్స్ చెల్లింపుల ఫలితంగా బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో నగదు తరలివెళ్లింది. దీంతో జనవరి 24నాటికి మొత్తం దేశీయ బ్యాంక్‌ల్లో రూ.3.5 లక్షల కోట్ల లిక్విడిటీ (ద్రవ్యత) కొరత ఏర్పడిందని విశ్లేషకులు తెలిపారు. ఈ తరుగుదల 14 ఏండ్ల గరిష్ఠం. బ్యాంకింగ్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు తగినంత నగదు ఉండేలా పలు సాధనాలతో మనీ మార్కెట్లో రిజర్వ్‌బ్యాంక్ జోక్యం చేసుకుంటున్నప్పటికీ, రోజురోజుకీ కొరత పెరిగిపోయింది. జనవరి 23న రూ.3.34 లక్షల కోట్లు ఉన్న కొరత 24కల్లా రూ.3.5 లక్షల కోట్లకు చేరిపోయింది. మనీ మార్కెట్లో స్వల్పకాలిక అవసరాలున్న బ్యాంక్‌లు తీసుకోవడం, మిగులు ఉన్న బ్యాంక్‌లు విక్రయించడం చేస్తుంటాయి. వీటిపై కొద్దిపాటి వడ్డీ రేటు ఉంటుంది.

14 ఏండ్ల గరిష్ఠానికి కొరత.. ఎందుకు?

కొద్ది రోజుల క్రితం నుంచి పండుగ సీజన్లో క్రమేపీ కరెన్సీ విత్‌డ్రాయల్స్ జరగడం, కార్పొరేట్లు, హెచ్ఎన్ఐలు వారి ఖాతాల నుంచి అడ్వాన్సు టాక్స్‌కు చెల్లింపులు జరపడం ఒక కారణమైతే జనవరి 20న వస్తుసేవల పన్ను చెల్లింపులతో భారీగా నగదు తరలివెళ్లింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తక్కువ వ్యయం చేయడంతో వ్యవస్థలోకి తగినంత నగదు సరఫరా జరగలేదని మనీ మార్కెట్ నిపుణులు తెలిపారు. కొటక్ మహీంద్రా బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం జీఎస్టీ చెల్లింపులకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రూ.1 లక్ష కోట్లు తరలిపోయాయి.

అధిక స్థాయిలోనే వడ్డీ రేట్లు

బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ కొరత కారణంగా కాల్ మనీ, వాణిజ్య పత్రాలు, డిపాజిట్లలతో సహా అన్ని సాధనాలపై స్వల్పకాలిక రేట్లు పెరుగుతాయి. కాల్‌మనీ మార్కెట్లో సగటు రేటు జనవరి 24న 6.83 శాతం ఉండగా, అది 25న 6.8565 వద్దకు పెరిగిపోయింది. ఇటీవల కొన్ని బ్యాంక్‌లు డిపాజిట్ల రేట్లు పెంచిన సంగతి తెలిసిందే. అలాగే రుణాలపై వడ్డీ రేట్లను కూడా అధికం చేస్తాయి. వాస్తవానికి ఆర్బీఐ తాను గతంలో పెంచిన రేట్లకు అనుగుణంగా బ్యాంకులు రేట్లను సర్దుబాటు చేయలేదన్న భావనతోనే ఎప్పటికప్పుడు వ్యవస్థలో లిక్విడిటీని కట్టడి చేస్తున్నదని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఎన్నికల సంవత్సరం అయినందున ద్రవ్యోల్బణం పెరగకుండా బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు ప్రవాహాన్ని ఆర్బీఐ మేనేజ్ చేస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో మరికొద్దికాలం గరిష్ఠస్థాయిలో వడ్డీ రేట్లు కొనసాగుతాయని వివరించారు.

వీఆర్ఆర్ వేలం ద్వారా నగదు

బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు పెరిగిపోయిన సమయంలో దానిని తీసుకోవడం, కొరత ఏర్పడినపుడు తగినంతగా అందచేయడానికి వీఆర్ఆర్ (వేరియబుల్ రెపో రేటు) వేలాల్ని ఆర్బీఐ నిర్వహిస్తుంది. నగదు అవసరమైన బ్యాంక్‌లు ఈ వేలంలో పాల్గొంటాయి. ఆర్బీఐ ప్రస్తుత రెపో రేటు 6.5 శాతానికంటే మించి ఒక కటాఫ్ రేటును నిర్ణయిస్తుంది. ఈ కటాఫ్‌కంటే ఎక్కువ రేటును బ్యాంక్‌లు కోట్ చేయాల్సి ఉంటుంది. జనవరి 25న రూ.2,50,010 కోట్లను ఇచ్చేందుకు 6.72 కటాఫ్ రేటుతో 15 రోజుల వీఆర్ఆర్ వేలాన్ని నిర్వహించగా, బ్యాంక్‌లు రూ.3,08,024 కోట్ల విలువైన బిడ్స్ సమర్పించాయి. ఈ వేలంలో పొందిన డబ్బును తిరిగి 15 రోజుల్లో బ్యాంక్‌లు చెల్లించాల్సి ఉంటుంది. ఇంతేకాకుండా ఒక రోజు అవసరాల కోసం నగదు తీసుకునేందుకు మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) అనే ఆర్బీఐ లిక్విడిటీ విండో కూడా బ్యాంక్‌లకు అందుబాటులో ఉంటుంది.

ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్ సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న బీఏఐ నిర్వాహకులు

కాంట్రాక్ట్ విధానాలు మారాలి

జాతీయ స్థాయిలో ఒకే పాలసీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి

బీఏఐ జాతీయాధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి డిమాండ్

రేపట్నుంచి నగరంలో ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్ సదస్సు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): జాతీయ స్థాయిలో నిర్దిష్టమైన కాంట్రాక్ట్ విధివిధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయాధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒకే దేశం-ఒకే పన్ను విధానం తరహాలో కామన్ కాంట్రాక్ట్ డాక్యుమెంట్ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. బీఏఐ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్ సదస్సు వివరాలను గురువారం ఇక్కడ న్యాక్ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. హైటెక్స్‌లో జరిగే ఈ 31వ జాతీయ సదస్సుకు భారీ ఏర్పాట్లు చేశామని, ఈ నెల 27 నుంచి 29 వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సైతం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పర్యటించి కాంట్రాక్టర్ల సమస్యలను అధ్యయనం చేసినట్టుగా తెలిపారు. ఈ క్రమంలోనే టెండర్లు, బిల్లుల చెల్లింపుల విషయంలో నిర్దిష్టమైన ప్రభుత్వ విధానం లేకపోవడమే ఈ రంగంలో సమస్యలకు కారణమని చెప్పారు. పనులు పూర్తి చేసిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కాగా, సదస్సులో 800లకుపైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. నిర్మాణ రంగంలో అధునాతన టెక్నాలజీ, మెటీరియల్, నూతన పరికరాలపై అవగాహన, చర్చాగోష్ఠిలను చేపట్టనున్నారు. ప్రముఖులు, నిపుణుల ప్రసంగాలూ ఉంటాయి. ఇదిలావుంటే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.25 తీసుకురావడంపై ఎస్ఎన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు మధ్య బీఏఐ వారధిగా నిలుస్తుందని సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బొల్లినేని శీనయ్య స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఏఐ రాష్ట్ర అధ్యక్షుడు కే దేవేందర్ రెడ్డితో పాటు కార్యదర్శి సచ్చిదానంద రెడ్డి, మెంబర్స్ కమిటీ చైర్మన్ డీవీఎన్ రెడ్డి, హైదరాబాద్ సెంటర్ చైర్మన్ భూపేందర్ సింగ్, వైస్ చైర్మన్ బల్మూరి సుగుణాకర్ రావు, కోశాధికారి నరేందర్ రెడ్డి, సంకినేని కృష్ణారావు, వి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి మెగా ప్లాన్

55కి.మీ మేర మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి • సీఐఐ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణను 2050నాటికి పారిశ్రామికంగా గణనీయంగా అభివృద్ధి చేయడానికి సమగ్ర మెగా మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగానే 55 కిలోమీటర్ల మేర మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధి బాధ్యతలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించినట్టు ఆయన చెప్పారు. ప్రతిపాదిత రివర్ ఫ్రంట్‌లో అమ్యూజ్‌మెంట్ పార్కులు, జలపాతాలు, వాటర్ స్పోర్ట్స్, వ్యాపార కేంద్రాల వంటి వాటితోపాటు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో షాపింగ్ మాల్స్ కూడా వస్తాయన్నారు. గురువారం భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో ఇక్కడి ఓ హోటల్‌లో నిర్వహించిన మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ సమ్మిట్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిని చేపడుతున్నామని చెప్పారు. దీనివల్ల స్థానికులతో పాటు పర్యాటకులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా ఎదిగేందుకూ అవకాశాలు పెరుగుతాయని, పెట్టుబడులు వస్తాయన్నారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, వ్యాపారావకాశాలు కూడా పెరుగుతాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. సాంస్కృతిక కార్యకలాపాలకు కూడా స్థలాలను కేటాయించడం వల్ల స్థానిక సంస్కృతికి వైభవం వస్తుందని, వీధి విక్రేతలకు స్థలాల కేటాయింపు ద్వారా వారికి జీవనోపాధి కలుగుతుందని వివరించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టువల్ల టూరిజం, ఎంటర్‌టైన్‌మెంట్, హాస్పిటాలిటీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, సీఐఐ తెలంగాణ చైర్మన్ సీ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ సాయి డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీవోబీ రూ.5,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ, జనవరి 25: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) జారీచేసిన బాండ్ల ఇష్యూకు భారీ స్పందన లభించింది. రూ.5,000 కోట్లు సమీకరణకు రూ.5,000 కోట్లకు దీర్ఘకాలిక ఇన్‌ఫ్రా బాండ్ల ఇష్యూను ప్రారంభించగా, రూ.14,950 కోట్ల విలువైన 128 బిడ్స్ అందాయని గురువారం బీవోబీ ఒక ప్రకటనలో తెలిపింది. 7.57 శాతం వార్షిక కూపన్ రేటుతో రూ. 5,000 కోట్ల విలువైన బిడ్స్‌ను ఆమోదించినట్టు బ్యాంక్ వెల్లడించింది.

హెచ్‌డీఎఫ్‌సీలో వాటా పెంచుకోనున్న ఎల్ఐసీ

9.99 శాతం వాటా కొనుగోలుకు ఆర్బీఐ అనుమతి

న్యూఢిల్లీ, జనవరి 25: బలహీన ఆర్థిక ఫలితాలతో విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటున్న ప్రైవేటు రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వాటా పెంచుకునేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు రిజర్వ్ బ్యాంక్ అనుమతి ఇచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చెల్లింపు మూలధనంలో 9.99 శాతానికి వాటా పెంచుకునే అనుమతి కోరుతూ తాము చేసుకున్న దరఖాస్తును ఆర్బీఐ గురువారం ఆమోదించినట్టు ఎల్ఐసీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ప్రస్తుతం ఈ బ్యాంక్‌లో ఎల్ఐసీకి 5 శాతం మేర వాటా ఉన్నది. ఆర్బీఐ నియంత్రణల మేరకు ఒక ఏడాదిలోపుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వాటాను ఎల్ఐసీ 9.99 శాతానికి పెంచుకోవచ్చు. అయితే ఆ పరిమితిని దాటకూడదు. ఈ బ్యాంక్‌లో మెజారిటీ వాటా (52 శాతం) విదేశీ ఇన్వెస్టర్ల వద్దే ఉన్నది. జనవరి 16న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాల్ని వెల్లడించిన తర్వాత ఇప్పటివరకూ ఆ షేరు 15 శాతం పైగా పతనమయ్యింది. ఎల్ఐసీకి ఆర్బీఐ నుంచి లభించిన తాజా అనుమతితో షేరు క్షీణతకు తాత్కాలికంగా బ్రేక్ పడుతుందన్న అభిప్రాయాల్ని విశ్లేషకులు వ్యక్తం చేశారు. గురువారం ఈ షేరు 1.44 శాతం తగ్గి రూ.1,435 వద్ద ముగిసింది.

సీబీడీసీని మెరుగుపరుస్తాం

ప్రభుత్వం, ఆర్బీఐ దీనిపై చురుగ్గా పనిచేస్తున్నాయి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జనవరి 25: సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ)ని మెరుగుపర్చేందుకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కలిసి చురుగ్గా పనిచేస్తున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలోనూ దీన్ని వియోగించుకోవచ్చని ఇక్కడ జరిగిన హిందూ కళాశాల 125 ఏండ్ల వేడుకలో పాల్గొన్న మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతో భారత్, ఇతర దేశాల మధ్య రెమిటెన్స్ రాకపోకల వ్యయం తగ్గుతుందని, చెల్లింపుల ప్రక్రియ కూడా సులభమవుతుందన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కాగా, హోల్‌సేల్ సీబీడీసీ పైలట్ ప్రాజెక్ట్ కోసం ఆర్బీఐ ఇప్పటికే 9 బ్యాంకులను గుర్తించింది. ఎస్బీఐ, బీవోబీ, యూబీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, కొటక్ మహీంద్రా, యెస్, ఐడీఎఫ్‌సీ, హెచ్ఎస్‌బీసీ అందులో ఉన్నాయి. అలాగే 2022 డిసెంబర్ 1నే సీబీడీసీ రిటైల్ వెర్షన్ లేదా ఈ-రూపీలో ఓ పైలట్ ప్రాజెక్ట్‌ను అమల్లోకి తెచ్చింది. దీంతో డిజిటల్ టోకెన్ రూపంలో ఈ-రూపీ లీగల్ టెండర్‌ను సూచిస్తున్నది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు, నాణేలతో సమానంగా వీటి జారీ ఉన్నది. ఈ ప్రాజెక్టులో భాగమైన ఆయా బ్యాంకులందించే డిజిటల్ వ్యాలెట్ ద్వారా ఈ-రూపీతో కస్టమర్లు లావాదేవీలనూ చేసుకోవచ్చు.

తయారీకి ఊతమివ్వాలి

గ్రీన్ టెక్నాలజీ, ఎగుమతులకు దన్నుగా ఉండాలి

రాబోయే బడ్జెట్‌లో పన్ను ప్రోత్సాహకాలు, మరిన్ని నిధుల కేటాయింపునకు దేశీయ పరిశ్రమ డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 25: దేశంలో తయారీ రంగానికి దన్నుగా, ఎగుమతులను ఉత్సాహపర్చేలా.. రాబోయే బడ్జెట్‌లో పరిశోధనలకు పన్ను ప్రోత్సాహకాలివ్వాలని, మార్కెటింగ్ కార్యకలాపాల విస్తృతికి వీలుగా మరిన్ని నిధులను కేటాయించాలని ఎగుమతిదారులుసహా భారతీయ పరిశ్రమ గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పెరుగుతున్న ఎగుమతులకు అనుగుణంగా పెరిగిపోతున్న రవాణా ఖర్చుల నిమిత్తం విదేశాలకు దేశం నుంచి వెళ్తున్న సొమ్ము ఎక్కువగానే ఉందని తెలియజేసింది. ఈ క్రమంలోనే ప్రైవేట్ రంగంతో భాగస్వామ్యంలో ఓ గ్లోబల్ షిప్పింగ్ లైన్‌నూ అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి ఇండస్ట్రీ వర్గాలు సూచించాయి. దీనివల్ల భారతీయ సంస్థలకు ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు వ్యయభారం తగ్గుతుందన్నాయి. '2021లో ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ చార్జీగా 80 బిలియన్ డాలర్లకుపైగా మేము చెల్లించుకోవాల్సి వచ్చింది. 2030 నాటికి ఇది 200 బిలియన్ డాలర్లను తాకవచ్చని అంచనా' అని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ఈ సందర్భంగా పేర్కొన్నది. అలాగే దేశంలో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) ప్రగతి కోసం వెయిటెడ్ ట్యాక్స్ డిడక్షన్ 200 శాతానికి పెరగవచ్చన్నది. 'చైనా, అమెరికా, కొరియా, ఇజ్రాయెల్ దేశాల కంటే ఆర్‌అండ్‌డీపై భారత్ పెడుతున్న ఖర్చు చాలా తక్కువ. దేశ జీడీపీలో 1 శాతానికిలోపే ఉన్నది. ఇది నిజంగా దురదృష్టకరం' అని ఎఫ్ఐఈవో ఉపాధ్యక్షుడు ఇస్రార్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ కస్టమర్లకు భారతీయ ఉత్పత్తులు, సేవలు అందేందుకు దూకుడుతో కూడిన ఎగుమతి మార్కెటింగ్ అవసరమని, కాబట్టి మార్కెట్ యాక్సెస్ ఇనీషియేటివ్ (ఎంఏఐ) స్కీం కింద వచ్చే బడ్జెట్‌లో మరిన్ని నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రూ.5,000 కోట్ల కార్పస్‌తో దేశవ్యాప్తంగా ఓ 50 జిల్లాల్లో పైలట్ ప్రాతిపదికన ఓ పథకాన్ని ప్రకటించేందుకున్న వీలును పరిశీలించవచ్చని కూడా కేంద్రానికి సలహా ఇచ్చారు. ఇదిలావుంటే ఉత్పాదక ప్రక్రియల్లో పర్యావరణహిత ఇంధనాన్ని వాడేందుకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కల్పించేందుకున్న అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వాన్ని స్టార్టప్ సంస్థ డబ్ల్యూపోసీఈ వ్యవస్థాపక డైరెక్టర్ అనుప్ గార్గ్ కోరారు. గ్రీన్ టెక్నాలజీల్లో పెట్టుబడుల కోసం రాయితీ రుణాలను అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

కొడుకులకు ప్రేమతో..

రూ.480 కోట్ల షేర్లను ఇచ్చిన అజీం ప్రేమ్‌జీ

న్యూఢిల్లీ, జనవరి 25: కుమారులపై తన ప్రేమను మరోసారి చాటుకున్నారు విప్రో అధినేత అజీం ప్రేమ్‌జీ. ఇద్దరు కుమారులైన రిషద్, తారిఖ్ ప్రేమ్‌జీలకు విప్రోలో తన కున్న షేర్లలో 1.02 కోట్ల షేర్లను బహుమతిగా అందించారు. ప్రస్తుత షేరు ధర రూ.472.9 ప్రకారం వీటి విలువ రూ.483 కోట్లు. ప్రస్తుతం విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ వ్యవహరిస్తున్నారు. 0.20 శాతానికి సమానమైన 1,02,30,180 ఈక్విటీ షేర్లను తన కుమారులైన రిషద్ అజీం ప్రేమ్‌జీ, తారిఖ్ అజీం ప్రేమ్‌జీలకు బహుమతిగా అందచేస్తున్నట్లు అజీం ప్రేమ్‌జీ ఒక ప్రకటనలో వెల్లడించారు.

పీఎన్‌బీ లాభం 2,223 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 25: ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రికార్డు స్థాయి లాభాలను ఆర్జించింది. డిసెంబర్ త్రైమాసికానికిగాను రూ.2,223 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.629 కోట్ల లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.25,722 కోట్ల నుంచి రూ.29,962 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.22,384 కోట్ల నుంచి రూ.27,289 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది.

హెచ్‌పీసీఎల్ లాభం మూడింతలు

న్యూఢిల్లీ, జనవరి 25: ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా, దేశంలో డీజిల్, పెట్రోల్ రిటైల్ ధరల్ని గరిష్ఠ స్థాయిలోనే కొనసాగించిన ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) భారీ లాభాల్ని ఆర్జించింది. డిసెంబర్‌తో ముగిసిన క్యూ3లో కంపెనీ లాభం మూడింతలై రూ.529 కోట్లకు చేరింది. నిరుడు ఇదే త్రైమాసికంలో లాభం రూ.172 కోట్లు. ఆదాయం రూ.1.18 లక్షల కోట్ల వద్ద నిలిచింది.

మార్కెట్లను ముంచిన ఎఫ్‌పీఐలు

- **71 వేల దిగువకు సెన్సెక్స్**

ముంబై, జనవరి 25: ఉవ్వేత్తున ఎగిసిన స్టాక్ మార్కెట్లు అంతే వేగంతో కిందకు పడిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు(ఎఫ్ఐఐ) తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడంతోపాటు ఐటీ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో గురువారం సూచీలు భారీగా నష్టపోయాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐల నిధుల ఉపసంహరణ కొనసాగుతుండటం, ఐటీ సంస్థల నిరాశాజనక ఆర్థిక ఫలితాలు మార్కెట్లను నష్టాల వైపు నడిపించాయి. ఒక దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ 71 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 359.64 పాయింట్లు నష్టపోయి 70,700.67 పాయింట్ల వద్ద ముగిసింది. 30 షేర్లలో 19 షేర్లు నష్టపోగా, కేవలం 11 షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోసూచీ నిఫ్టీ కూడా 101.35 పాయింట్లు కోల్పోయి 21,352.60 పాయింట్ల వద్ద నిలిచింది. అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరుగుతుండటం, కార్పొరేట్ల మిశ్రమ ఆర్థిక ఫలితాలు ఎఫ్ఐఐలను అమ్మకాలవైపు నడిపించాయి. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, రంగ షేర్లు కుదేలయ్యాయి.

కుప్పకూలిన టెక్ మహీంద్రా షేరు

నిరుత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో టెక్ మహీంద్రా షేరు కుప్పకూలింది. గత త్రైమాసికంలో సంస్థ నికర లాభం 60 శాతం క్షీణించి రూ.510 కోట్లకు పడిపోవడం మదుపరులను మెప్పించలేకపోయింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో కంపెనీ షేరు ధర 6 శాతానికి పైగా నష్టపోయింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 6.12 శాతం తగ్గి రూ.1,321.60 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈలోనూ షేరు 5.89 శాతం పతనం చెంది రూ.1,325 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,407.73 కోట్లు కరిగిపోయి రూ.1,29,011.81 కోట్ల వద్ద నిలిచింది.

- టెక్ మహీంద్రా షేరు 6.12 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, విప్రో, ఏషియన్ పెయింట్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లె, కొటక్ బ్యాంక్, టాటా స్టీల్, టీసీఎస్ ఒక్క శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- ఎస్బీఐ, మారుతి, హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్‌లు నష్టపోయాయి.
- కానీ, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, టైటాన్, బజాజ్‌ఫైనాన్స్, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- 71,022 పాయింట్ల వద్ద ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ సూచీ ప్రారంభంలోనే బుధవారం గరిష్ఠ స్థాయి 71,049ని తాకింది. 70,319 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన సూచీ చివరకు 70,700 వద్ద ముగిసింది.
- రంగాలవారీగా చూస్తే టెక్నాలజీ షేర్లు 1.39 శాతం, ఐటీ 1.23 శాతం, టెలికమ్యూనికేషన్ 1.21 శాతం, ఎఫ్ఎంసీజీ 1.01 శాతం, బ్యాంకింగ్ రంగ సూచీలు నష్టపోయాయి.
- కానీ, యుటిలిటీ, పవర్, సేవలు, కమోడిటీలు, రియల్టీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.



సీతారామ్ జిందాల్

యంగ్ లియు